క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నిడదవోలు: పట్టణంలో ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత,గృహిణులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు, ఎంగేజ్‌మెంట్ టైపింగ్, ఇంటర్ నెట్, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఎనిమిదో తరగతి ఆపైన చదివిన వారు అర్హత కలిగిన 16 ఏళ్ల నుంచి 38 ఏళ్ల లోపు ఉన్న వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఆమే కోరారు. ఈ నెల 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా కళాశాలలో ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.బాబు 96760 52454 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పల్లంట్ల, చిక్కాల, లక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాను శనివారం నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు. వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నసమారాధన

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గుంటిపల్లి సత్యసాయి ఆర్థిక సహకారంతో శుక్రవారం రోగులు, సహాయకులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన శిబిరంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, ఈరిశెట్టి రాజగోపాలస్వామి, ఎండి ఫయాజ్, సత్య సాయి నిత్యాన్నదాన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

స్వామిత్వతో యాజమాన్య హక్కులు

నిడదవోలు రూరల్: మండలంలోని గ్రామ కంఠాల ఇళ్లు, ఖాళీస్థలపై ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు స్వామిత్వ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఈఓపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలో ఈ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ కార్యక్రమంలో ఇచ్చే యాజమాన్య హక్కు పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సులభతరంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. ఈ సర్వేతో పంచాయతీలకు సంబంధించిన ఆస్తుల విషయంలో స్పష్టత వస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూముల వేలంతో రూ.6.50 లక్షల ఆదాయం

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో వేంచేసియున్న మదనగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన 36.73 ఎకరాల భూములను శుక్రవారం ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ భూములను గత నెలలో బహిరంగ వేలం నిర్వహించగా, అనంతపల్లికి చెందిన రైతు అత్యధికంగా ఎకరం రూ.37 వేలకు పాడుకుని, ధరావస్తు సొమ్మును తీసుకోకుండా కౌలును రద్దు చేసుకోవడంతో మరలా వేలం పాట నిర్వహించినట్టు ఆయన చెప్పారు. వేలం ద్వారా రూ.6.50 లక్షలు ఆదాయం వచ్చినట్టు ఆయన తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి ఎకరం రూ.18 వేల చొప్పున కౌలు దారులు పాడుకున్నట్టు ఆయన వివరించారు. ఈ మేరకు ఏడాదికి రూ.6.50 లక్షలు కౌలు దారులు చెల్లించవలసి ఉందని ఆయన వెల్లడించారు.

అపర కర్మల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

తాళ్లపూడి: మండలంలోని రావూరుపాడులో శుక్రవారం మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు జొన్నగడ్డ సుబ్బరాయ చౌదరి సొంత నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన అపర కర్మల భవనాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సుబ్బరాయ చౌదరి, ఏఎంసీ వైస్‌చైర్ పర్సన్ రేఖపల్లి మంగామణి ప్రారంభించారు. గ్రామంలో అపర కర్మలు జరుపుకోవడానికి ఇబ్బంది లేకుండా అందుబాటులోకి రావడంతో గ్రామస్తులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధా దుర్గారావు, రేఖపల్లి ముత్యాలరావు, సిద్ధా సీతారామకృష్ణ, కోడి శంకరం, తిగిరిపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌లకు స్వస్తి

- కళాశాలలపై కూటమి నిర్లక్ష్యం
- వెంటాడుతున్న అధ్యాపకుల కొరత
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



నల్లజర్ల ప్లస్ టూ కళాశాల విద్యార్థినులు



పోతవరం ప్లస్ టూ హైస్కూల్ భవనం

నల్లజర్ల: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు లేని మండలాల్లో గల ఉన్నత పాఠశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో 2022–23 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ప్రారంభించారు. వీటికి 'హైస్కూలు ప్లస్' అని పేరు పెట్టారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా 2022 విద్యాసంవత్సరం నుంచి ఈ హైస్కూలు ప్లస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలలోని బాలికలకు ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చింది. ముందుగా జిల్లాలోని నల్లజర్లలో ఏర్పాటు కాగ తర్వాత సంవత్సరం పోతవరంలో ప్లస్‌టు అమలు చేశారు. మండలంలో 9 జడ్పీ హై స్కూళ్లు 5 ప్రైవేటు కళాశాలలు, 10కి పైగా ప్రైవేటు హైస్కూళ్లు ఉన్నాయి. నల్లజర్ల హైస్కూలు ప్లస్‌లో మొదటి ఏడాది ప్రవేశాలు అంతంత మాత్రంగా ఉన్నా తర్వాత సంవత్సరం అమాంతం పెరిగాయి. వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన హైస్కూల్ ప్లస్‌లను కూటమి ప్రభుత్వం తొలగించే పనుల్లో నిమగ్నమైంది.

అడ్మిషన్లు తగ్గుముఖం

ఇంటి చెంతనే పిల్లలకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన లభిస్తుండటంతో తల్లిందండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సబ్జెక్ట్‌లకు అవసరమైన అధ్యాపకులను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. నియోజకవర్గంలోని పోతవరంలో రెండవ ఏడాది ఇక్కడ హైస్కూలు ప్లస్‌ను సైతం ఇక్కడ ఏర్పాటు చేసింది. అంతా సవ్యంగా సాగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం హైస్కూలు ప్లస్‌పై శీతకన్ను వేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి కారణంగా కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. దీంతో వీటిని ఎత్తివేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్రచేస్తోందని వందతులు వినిపిస్తున్నాయి.

అధ్యాపకుల కొరత

ప్లస్ టూ కళాశాలల్లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో కళాశాలలో 7 గురు అధ్యాపకులు ఉండాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్న నేటికి పాఠశాలలో టీచర్లను భర్తీ చేయపోవడంపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. నల్లజర్లలో ముగ్గురు అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపల్ కోమలి చిత్ర తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తెలుగు, ఫిజిక్స్, బోటనీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. చివరకు పాఠ్య పుస్తకాలను సరఫరా చేయలేదు. ఆయా ఉన్నత పాఠశాలల్లో అందుబాటులో ఉన్న స్కూలు అసిస్టెంట్లతో తరగతులు చెప్పించారు. నిబంధనల మేరకు పరిశీలిస్తే ఇంటర్ తరగతుల బోధనకు తొలుత వారికి శిక్షణ ఇవ్వాలి. కానీ అటువంటి కార్యక్రమం రూపొందించలేదు.

ప్లస్‌టూ ఎత్తేశారు

సంవత్సరం ఆలస్యంగా పోతవరం హైస్కూలులో ప్రారంభించిన హైస్కూలు ప్లస్‌కు అసలు అధ్యాపకుల నియామకమే జరగలేదు. మొదటి ఏడాది 13 మంది విద్యార్థులు చేరారు. హైస్కూలలో ఉన్న 20 మంది ఉపాధ్యాయులే వీరికి పాఠాలు బోధించేవారు. ఈ ఏడాది జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో 7గురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్త వారు రాలేదు. ఈ కారణంగా హైస్కూలులో ఉన్న విద్యార్థులకే పాఠాలు చెప్పడానికి టీచర్లు లేరు. ఈ కారణంగా ప్లస్‌టూలో కొత్తగా విద్యార్థులు చేరడం అటుంచితే ఉన్న 13 మంది విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లిపోయినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ప్లస్‌టూ ఎత్తివేశారు.

నాయకుల తీరు విచారకరం



నియోజకవర్గంలోనే అతి పెద్ద గ్రామం పోతవరం. అటువంటి గ్రామంలో ఆడపిల్లలకు ఇంటికి చేరువలో ఉంటుందని గత ప్రభుత్వ హాయాంలో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది గత ప్రభుత్వం. కేవలం అధ్యాపకులు లేకపోవడంతో కళాశాల ఎత్తివేయడం శోచనీయం. ఉన్నతాధికారులతో మాట్లాడి అధ్యాపకులను నియమిస్తే ఇక్కడి సమస్య పరిష్కారం అయ్యేది.

– పాపా నాగేశ్వరావు, ఎంపీటీసీ–1, పోతవరం

పున:ప్రారంభించాలి



సౌకర్యాలు మెరుగుపర్చి మళ్లీ ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చెయ్యాలి. అల్ప సంఖ్యాక వర్గాల బాలికలకు ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చినట్టే వచ్చి పోయింది. ఇది పూర్తిగా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లస్‌టూ కళాశాలలను ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పటిష్టం చేయాలి.

– చిడిపి చింతయ్య, ఎంపీటీసీ–3, పోతవరం

పీఎంశ్రీ పాఠశాలలకు నిధుల విడుదల



పీఎంశ్రీకి ఎంపికైన అనంతపల్లి జెడ్పీ హైస్కూలు

నల్లజర్ల: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి, ఐక్యత, ప్రజాస్వామ్యస్ఫూర్తిని పెంపొందించడం కోసం పీఎంశ్రీ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంఈఓ–1 వై.సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి సమగ్రశిక్షా ప్రాజెక్ట్ డైరక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో చెప్పారు. నియోజకవర్గంలో మొదటి విడతలో పీఎంశ్రీ కింద ఎంపికైన అనంతపల్లి, దేవరపల్లి, చిట్యాల హైస్కూల్సుకు ఒక్కో పాఠశాలకు రూ.25వేలు చొప్పున కేటాయించారు. విద్యార్థులలో స్ఫూర్తి నింపాలన్న ఉద్దేశ్యంతో కార్యక్రమాల నిర్వహణకు ఈ నిధులు కేటాయించనట్లు పేర్కొన్నారు. వీటిని ఏవిధంగా వినియోగించాలో ఉత్తర్వులలో పేర్కొన్నారు. జాతీయ జెండా, సౌండ్ సిస్టమ్‌కు రూ.2వేలు, ఆటలపోటీలకు రూ.5వేలు, చారిత్రక ఘటనలపై నాటికల ప్రదర్శనకు రూ.3వేలు, వ్యాసరచన, క్విజ్ పోటీలకు రూ.5వేలు,పెయింటింగ్ పోస్టర్ తయారీ, బహుమతులు, రిఫ్రెష్‌మెంట్, స్నాక్స్‌కు రూ.10వేలు వినియోగించాల్సి ఉంటుంది.

ట్రావెలర్స్ బంగ్లా దీనచూపులు

- శిథిలావస్థలో భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బంగ్లాలో నాచుపట్టి, పెచ్చులూ ఊడిపోతున్న గోడలు



పెరవలి ఇరిగేషన్ కార్యాలయంలో శిథిలమైన ట్రావెలర్స్ బంగ్లా

పెరవలి: దశాబ్దాలు సేవలు చేశాను. వయస్సులో ఉండగా అందరూ ఆదరించేవారు, దుమ్ముపడితే చాలు వెంటనే కడిగేసేవారు. నేడు ఒంట్లో సత్తువ అయ్యిపోవడంతో కూలిపోతున్నా పట్టించుకునే నాధుడే కరువైయ్యారు అంటూ పెరవలి ఇరిగేషన్ కార్యాలయంలో ఉన్న ట్రావెలర్స్ బంగ్లా వచ్చేపోయేవారికి తన గాధను దీనంగా చెప్పుకుంటుంది. 1874లో నిర్మించిన ఈ భవనం నేటికి సేవలు అందిస్తూనే ఉంది. గత పదేళ్లుగా ఈ బంగ్లాను పట్టించుకోకపోవటంతో శిథిలావస్థకు చేరుకుంది. పై స్లాబ్, గోడలు నాచుపట్టి పెచ్చులుగా ఊడిపోతుండటంతో సిబ్బంది వర్షాకాలంలో నానా పాట్లు పడుతున్నారు. రికార్డులు తడిచిపోకుండా కాపాడలేక ఇటీవల భవనాన్ని విడిచిపెట్టారు. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పలు పనుల కోసం వచ్చే అధికారుల కొద్ది రోజులు పాటు నివాసం ఉండేందుకు ఇది ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిని నిర్వహణకు కావలసిన చర్యలను చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తల్లిపాలతో బిడ్డకు మేలు



తల్లిపాలు ప్రధాన్యంపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యం ఇస్తుందని ముఖ్యంగా ముర్రిపాలు బిడ్డకు తప్పని సరిగా పట్టించాలి, ఇవి బిడ్డ ఎదుగుదలకు, రోగ నిరోధక శక్తిని ఇస్తాయని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి ప్రసాద్ తెలిపారు. తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం పెరవలి పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెలివరీ అయిన మూడు గంటల్లోపు పిల్లలకు ముర్రిపాలు పట్టిస్తే ఆబిడ్డ ఎంతో ఆరోగ్యవంతంగా ఉంటారని దీనిని తల్లులు మర్చిపోవద్దని, అదే సమయంలో పాలు ఇవ్వటం వలన తల్లి ఆరోగ్యం త్వరగా కుదుటపడి కోలుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతతో వ్యవసాయం సులభతరం



డ్రోన్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నల్లజర్ల: యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయం మరింత సమర్థవంతంగా, సులభతరంగా చేసేందుకు డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయని సేంద్రియ వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌చార్జి కోటేశ్వరీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రైతులకు సేంద్రియ వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. డ్రోన్లతో అన్ని పంటలకు ఎరువులను పిచికారి చేయడానికి అనుకూలంగా ఉండటంతో వేగంగా పని పూర్తవుతుందన్నారు. దీంతో రైతులు డ్రోన్లు వినియోగానికి ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలోను డ్రోన్లు వినియోగిస్తున్నారని కాబట్టి రైతులు ఆ దిశగా రానున్న కాలంలో అడుగులు వేయాలని సూచించారు.


భూముల రీసర్వేకు ప్రత్యేక చర్యలు



రీసర్వేపై అవగాహన సదస్సులో డీపీఓ

చాగల్లు: మండలంలోని గ్రామ కంఠాల భూములను, గృహాలను, ఖాళీస్థలాల అనుభవదారులను గుర్తించి, అర్హులకు ప్రభుత్వం హక్కులను కల్పించనుంది. ఈ మేరకు రీసర్వే చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీపీఓ శాంతామణి తెలిపారు. చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద స్వామిత్వ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ రీసర్వే ముందు సచివాలయ సిబ్బంది భూమికి సంబంధించిన యజమానులకు నోటీసులు అందించాలని, సర్వే చేసిన తర్వాత ప్రాపర్టీ కార్డు అందిస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్లు సులభతరంమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నమట్ల మనశాంతి, ఈఓపీఆర్డీ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆలీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల



మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్ యోజన కింద తొలివిడతగా శనివారం రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలోని అర్హులైన 19,317 మంది రైతన్నల ఖాతాల్లో తొలివిడతగా అర్హులైన ప్రతీ రైతన్న బ్యాంకు ఖాతాలోకి కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేల రూపాయలను నేరుగా జమ చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. నిడదవోలు రూరల్ మండలంలో 7,731 మంది రైతులకు రూ.5.41 కోట్లు, పెరవలి మండలంలో 7,022 మంది రైతులకు రూ.4.91 కోట్లు, ఉండ్రాజవరం మండలంలో 4,564 మంది అర్హులైన రైతన్నలకు రూ.3.19 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. నిధుల జమ విషయంలో ఏమైనా సందేశాలు, సమస్యలు ఉంటే 155251 కాల్ సెంటర్‌కు లేదా, 95523 00003 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్‌కు ఫోన్ చేయాలని, స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చని సూచించారు.

గడప గడపకూ వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: ఎన్నికల హమీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను చేస్తున్న మోసాలను గడపగడపకు వెళ్లి ఐక్యంగా వివరిద్దామని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉండ్రాజవరం సుధీంద్రబాబు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సాయత్రం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఎన్నికలల్లో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు వందల హమీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచి పోయిన వాటిలో ఏఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. చంద్రబాబుకు ఓటు వేసిన ప్రతిసారి ప్రజలను మోసం చేశాడన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాది కాలంలో రూ1.60 లక్షల కోట్లు అప్పులు చేశారని విమర్శించారు.

కల్లబొల్లి మాటలు

నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, వలంటీర్లుకు రూ.10వేలు వంటి పథకాలు అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు, పవన్‌లు సంతకాలు పెట్టిన బాండ్ పేపర్లు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కష్టాలు తప్పడం లేదన్నారు. విద్యార్థులు, రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు, అన్నదాతలు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. 2029లో వైసీపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ మండల నూతన కమిటిని సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహ మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీ దోడ్డా సతీష్, నియోజకవర్గ నాయకులు కఠారి సిద్ధార్థరాజు, పింద్ర పోసియ్య, చోళ్ల శ్రీనివాసు, కరెళ్ల శ్రీనివాసు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, చిటికెన సూరిబాబు, మరమట్ల నాగరాజు, రఘుమండ శ్రీనివాసు, నిమ్మన శ్రీనివాసు, కోఠారి సత్యనారాయణ, గుణ్ణం రవికుమార్, జి.మునేశ్వరరావు, సర్పంచ్ మెండే వెంకట్రావుతో పాటు వివిద గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, శ్రేణులు

శ్రావణం.. శుభకరం

- వెల్లివెరిసిన శ్రావణ శోభ
- మహిళలతో కిక్కిరిసిన ఆలయాలు



తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మీ దేవి అమ్మవారు



బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ అమ్మవారు

తాళ్లపూడి: తెలుగు నెలల్లో ఐదో నెల శ్రావణ మాసం. వర్షాకాలంలో వచ్చే ఈ నెలలో ప్రతీ రోజూ ఆధ్యాత్మికంగా విశేషమైన ప్రాముఖ్యతని కలిగి ఉంది. ఈ నెలలో వచ్చే పండగలు మాత్రమే కాదు, శ్రావణ సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలకు ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో రెండో శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. వరలక్ష్మీదేవిని శ్రావణమాసంలో పూజించడం ద్వారా సౌభాగ్య సిద్ధి కలుగుతుందని అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి తెలిపారు. మండలంలోని తాళ్లపూడిలో గల శ్రీరాజ్యలక్ష్మీ దేవి ఆలయంలో తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల చామంతి, గులాబీ, కనకాంబరం పూలతో అంకరించారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు, అర్చనలు నిర్వహించారు.

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గోష్పాదక్షేత్రంలోని బాల త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలోను, మెరకవీధి కనకదుర్గమ్మ ఆలయంలోను, కొవ్వూరమ్మ ఆలయంలోను, కుమారదేవం గండి పోశమ్మ ఆలయంల్లో అమ్మవార్లను పూజలు నిర్వహించి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

శ్రావణమాస పూజలు

చాగల్లు: శ్రావణ మాసం పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాగల్లు పాటిమ్మ అమ్మవారు, కనకదుర్గమ్మ, ధనలక్ష్మి అమ్మవారి ఆలయాలు, బ్రాహ్మణగూడెంలో నాగారమ్మ, కనకదుర్గమ్మ, ఊనగట్లలో కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు కుంకుమపూజలు నిర్వహించి అమ్మవార్లను అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ చేశారు.

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

నిడదవోలు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను నిరసిస్తూ (ఐఎఫ్‌టీయూ) అనుబంధ ఆదర్శ ప్లాట్‌ఫాం రిక్షా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో గణపతి జంక్షన్‌లో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు వ్యతిరేకించిన నేటి పాలకపక్షం తిరిగి అమలు చేస్తుండటంతో ప్రజలను వంచించేటమేనన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.సారధి మాట్లాడుతూ భవిష్యత్తులో కరెంట్ పేరు తల్చుకుంటేనే షాక్‌తో ప్రజలు సొమ్మసిల్లే పరిస్థితి నెలకుంటుందన్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌర సేవలు



కొవ్వూరులో పింఛన్ అందిస్తున్న రాణి సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. కొవ్వూరు పట్టణంలోని 9వ వార్డుకు చెందిన దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుడు సుధాపల్లి అప్పలరాజుకు రూ.6,000 పింఛన్ సొమ్మును శుక్రవారం ఇంటి వద్దనే అందజేశారు. లబ్ధిదారులకు ఇబ్బందులకు కలగకుండా మానవీయ కోణంలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.